సాక్షి
సంగారెడ్డి
సోమవారం, 16, జూన్, 2025



అర్చకులకు తీపి కబురు
ప్రభుత్వం అర్చక, ఉద్యోగులకు తీపికబురు అందించింది. ఎట్టకేలకు వారికి బెనిఫిట్స్ ప్రకటించింది. వివరాలు 8లో ►



ప్రాణం తీసిన డ్రైవింగ్ సరదా
డ్రైవింగ్ సరదా విద్యార్థి ప్రాణం తీసింది. ఈఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలో జరిగింది. వివరాలు 8లో ►



రియాల్టీ రంగం కళ తప్పింది!
జహీరాబాద్ ప్రాంతంలో రియల్ జోరు కాస్త తగ్గింది. దీంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. వివరాలు 9లో ►

న్యూస్‌రీల్

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: నిరుద్యోగులకు సీసీ కెమెరా సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ డైరెక్టర్ వంగ రాజేంద్రప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో చెప్పారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని 18 నుంచి 45 ఏళ్ల పురుషులకు ఈనెల 24వ తేదీ నుంచి 13 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 9490103390, 9490129839 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. శిక్షణ కాలంలో పూర్తిగా ఉచిత భోజనంతో పాటు వసతి కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లను అందజేస్తామని పేర్కొన్నారు.

జనారణ్యంలోకి జాతీయ పక్షి



నెమలితో అటవీశాఖ సిబ్బంది, పోలీస్‌లు

చిన్నశంకరంపేట(మెదక్): వనంలో ఉండాల్సిన జాతీయ పక్షి నెమలి జనారణ్యంలోకి వచ్చింది. శనివారం రాత్రి నార్సింగి మండల కేంద్రంలోని రైతు వెంకట్‌రెడ్డి పశువుల పాకలోకి వచ్చి అరవడంతో గమనించిన రైతు పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో పోలీసులు వల్లూర్ అటవీశాఖ అధికారులను పిలిపించి నెమలిని అప్పగించగా.. వారు వల్లూర్ అడవిలో వదిలిలారు.

పోస్టాఫీస్ నూతన భవనాన్ని నిర్మించండి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జోగినాథ్

జోగిపేట(అందోల్): నూతన పోస్టాఫీస్ భవనం నిర్మించాలని జోగిపేట ఏఎంసీ మాజీ చైర్మన్ గంగ జోగినాథ్ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని పోస్టాఫీస్ భవనం నిర్మించి చాలా ఏళ్లు కావడంతో శిథిలావస్థకు చేరిందన్నారు. నూతన భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు. నూతన భవన నిర్మాణం కోసం సంబంధిత మంత్రికి సిఫారసు చేయించి నిధులు విడుదల చేయిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

దివ్యాంగులకు మరింత ప్రోత్సాహం

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వం దివ్యాంగులకు మరింత ప్రోత్సాహం అందజేస్తుందని డీడబ్ల్యూఓ హైమావతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇద్దరు దివ్యాంగులు పెళ్లి చేసుకుంటే కల్యాణలక్ష్మితో పాటు రూ. లక్ష వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు చెప్పా రు. గతంలో ఇద్దరు దివ్యాంగులు పెళ్లి చేసుకుంటే ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం ఉండేది కాదన్నారు. ఇక నుంచి పెళ్లి చేసుకున్న జంటలో ఇద్దరూ దివ్యాంగులైనా, ఒకరు దివ్యాంగులైనా కల్యాణలక్ష్మితో పాటు రూ. లక్ష మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి జారీ చేసిన ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలన్నారు. వధువు 18, వరుడు 21 ఏళ్లు నిండి ఉండాలని పేర్కొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



మాట్లాడుతున్న రంగనాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): రైతులు ఆయిల్‌పామ్ సాగు చేసి అధిక లాభాలు పొందవచ్చని రాష్ట్ర ఆయిల్‌పామ్ టెక్నికల్ అడ్వైజర్ రంగనాయకులు అన్నారు. ఆదివారం మండలంలోని ఎలుకపల్లి శివారులో రైతు సత్యనారాయణగౌడ్ వ్యవసాయ క్షేత్రంలోని తోటలను పరిశీలించి మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగుతో నీటి ఆదాతో పాటు అంతర్గత పంటలు సాగు చేసుకొని అధిక లాభాలు పొందవచ్చన్నారు. దేశ వ్యాప్తంగా 259 లక్షల టన్నుల ఆయిల్‌పామ్ వాడకం జరుగుతుంటే, కేవలం 97 లక్షల టన్నుల ఉత్పాదన మాత్రమే జరుగుతుందన్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకు అత్యధికంగా సబ్సిడీ ఇస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ కృష్ణారావు, డిప్యూటీ మేనేజర్ అశోక్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం ఆహ్లాదం



కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని కృష్ణాపూర్ నుంచి నాగధర్, సంజీవన్‌రావుపేట వరకు అటవీ ప్రాంతం పచ్చదనం పరుచుకుంది. రహదారికి ఇరువైపులా ఆహ్లాదం పంచుతోంది. వేసవిలో ఆకులు రాలి బోసిపోయి కనిపించింది. ఇటీవల కురిసిన వర్షాలతో చిగురించి దట్టంగా మారింది. నెమళ్లు, ఇతర వన్యప్రాణుల అరుపులు వాహనదారులను ఆకట్టుకుంటుంది.

ఏడుపాయల జనసంద్రం



ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ



ఆలయం ఎదుట జనసందోహం

పాపన్నపేట(మెదక్): వన దుర్గమ్మా.. మము దీవించమ్మా అంటూ వేలాది భక్తులు వేడుకున్నారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు మంజీర పాయల్లో స్నానాలు చేసి, బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు ఒడిబియ్యం పోసి, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈఓ చంద్రశేఖర్, ఆలయ సిబ్బంది, పోలీసులు చర్యలు తీసుకున్నారు.

కౌలు రైతుకేదీ భరోసా?

- ప్రభుత్వం నుంచి అందని సాయం
- బ్యాంకులు సైతం కనికరించని వైనం
- వడ్డీ వ్యాపారులపైనే భారం



కొండాపూర్(సంగారెడ్డి): ఎన్ని ప్రభుత్వాలు మారిన కౌలు రైతుల బతుకులు మాత్రం మారడం లేదు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేవలం పట్టాదారు రైతులకు పెట్టుబడి సహాయం అందించేది. కౌలు రైతులు భూమిని కౌలు తీసుకుని పంటలను సాగు చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు వారికి ఏ మాత్రం సహాయం అందించడం లేదు. చివరికి ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం వాటిల్లితే ప్రభుత్వం అందించే నష్ట పరిహారం కూడా పట్టాదారు రైతులకే ఇస్తుండటంతో కౌలు రైతుల బతుకులు దుర్భరంగా మారుతున్నాయి. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కౌలు రైతులకు ఎకరాకు రూ.15 వేలు ఇస్తానని చెప్పిన మాట నీటిపై రాతల్లాగే మిగిలిపోయింది. ప్రజా ప్రభుత్వం అని చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు దాటినా కౌలు రైతుల ఊసే ఎత్తడం లేదు.

జిల్లాలో 50 వేలకు పైగా కౌలు రైతులు

జిల్లాలో లక్షన్నరకు పైగా పట్టాదారు రైతులు వుండగా అందులో సుమారు 50 వేలకు పైగా కౌలు రైతులున్నారు. ప్రభుత్వం కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లపై ఒత్తిడి తీసుకువస్తున్నప్పటికీ, పంటలు పండక కౌలు రైతులు నష్టం చవిచూడాల్సి వస్తే రుణాల వసూళ్ళ సమయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం వుంటుంది. దీంతో బ్యాంకర్లు కౌలు రైతులకు రుణాలు ఇచ్చేందుకు వెనుకంజ వేస్తున్నట్లు సమాచారం. బ్యాంకర్లు రుణాలు ఇవ్వకపోవడంతో ప్రైవేట్ వ్యక్తుల దగ్గర అధిక వడ్డీకి అప్పులు తీసుకుంటున్నారు. తీరా పంటలు పండి చేతికి వచ్చే సమయానికి పంటలకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో కౌలు రైతులు తీవ్ర నష్టాలను చవి చూడటమే కాకుండా మరి కొంతమంది కౌలు రైతులు అప్పుల బాధలు భరించలేక ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు జిల్లాలో కోకొల్లలు.

ప్రభుత్వమే ఆదుకోవాలి



గత సంవత్సరం 10 ఎకరాలు కౌలుకు తీసుకొని చెరుకు పంటను సాగు చేశాను. అధిక వర్షపాతం వలన రెండు లక్షల వరకు నష్టం వాటిల్లింది. బ్యాంకులు కౌలు రైతులకు ఎలాంటి రుణాలు ఇవ్వకపోవడంతో ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ ఏడాది కూడా మళ్లీ చెరుకు పంటను సాగు చేశాను. ప్రభుత్వం పట్టాదారులకు కాకుండా క్షేత్ర స్థాయిలో పంటలను సాగు చేసేవారికి రైతు భరోసా అందించాలి.

– లక్ష్మణ్, కౌలు రైతు, మారేపల్లి

గుర్తింపు కార్డులివ్వాలి



కౌలు రైతులు ఒక ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు పెట్టి మరీ కౌలు తీసుకుని పంటలను సాగు చేస్తున్నారు. కౌలు రైతులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలలో చెప్పిన విధంగా సంవత్సరానికి రూ.15 వేలు చెల్లించాలి. ఇదే కాకుండా కౌలు రైతులకు రుణాలు ఇచ్చే విధంగా బ్యాంకర్లకు ఆదేశాలు జారీ చేయాలి. పంట నష్ట పరిహారం కూడా సాగు చేసిన వారికే వచ్చే విధంగా చూడాలి.

–రాజయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ రఘునందన్, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, పోలీస్ ఉన్నతాధికారులు

సరికొత్త హంగులతో పోలీస్‌స్టేషన్

ఐజీ సత్యనారాయణ

జిన్నారం(పటాన్‌చెరు): సీఎస్ఆర్ నిధులతో అత్యాధునిక వసతులతో మోడల్ పోలీస్‌స్టేషన్ నిర్మించడం అభినందనీయమని మల్టీజోన్–2 ఐజీ సత్యనారాయణ అన్నారు. ఆదివారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో నూతన పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, హెటిరో పరిశ్రమ ప్లాంట్ డైరెక్టర్ మోహన్‌రెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఐజీ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే అత్యాధునిక పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హెటిరో పరిశ్రమ సహకారంతో రూ. 3.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్పీ పరితోష్ పంకజ్, డీఎస్పీ ప్రభాకర్, సీఐ రవీందర్‌రెడ్డి, నరేష్, లాలునాయక్, కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, నాయకులు చంద్రారెడ్డి, హన్మంత్‌రెడ్డి, ఆనంద్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సైబర్ బాధితులకు సత్వర న్యాయం

- కోల్పోయిన డబ్బు చెల్లింపులో జిల్లాకు ఐదో స్థానం
- ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి జోన్: సైబర్ క్రైంలో కోల్పోయిన డబ్బును తిరిగి చెల్లించడంలో రాష్ట్రంలో జిల్లాకు ఐదో స్థానం దక్కిందని ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమిషనరేట్లు మినహా జిల్లాలతో పోలిస్తే సంగారెడ్డి మొదటి స్థానంలో నిలిచిందన్నారు. క్షణికావేశంలో చేసే తప్పులను సరిదిద్దుకోవడానికి లోక్ అదాలత్ మంచి అవకాశం అన్నారు. ముఖ్యంగా సైబర్ బాధితులకు సత్వర న్యాయం చేసేందుకు జిల్లాలో బృందాలను ఏర్పాటు చేసి డీఎస్పీ స్థాయి అధికారులచే పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన 206 సైబర్ కేసులలో రూ. 1.43 కోట్లను తిరిగి బాధితులకు ఇప్పించేందుకు ఆర్డర్ కాపీలను సంబంధిత బ్యాంకు నోడల్ అధికారులకు పంపించామని తెలిపారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల 1,279 కేసులు లోక్ అదాలత్‌లో రాజీ కుదిరిందని తెలిపారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



లబ్ధిదారులకు ఇంటి మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): సీఎం రేవంత్‌రెడ్డి పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం పెద్దశంకరంపేట మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి విడతలో మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, బిల్లులు త్వరితగతిన అందజేస్తామన్నారు. ఉచిత ఇసుక ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి మహిళా సంఘాల ద్వారా రూ. 1 లక్ష వరకు రుణం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భవాని, నాయకులు సురేందర్‌రెడ్డి, మధు, నారాగౌడ్, ఆర్ఎస్.సంతోష్, దాచ సంగమేశ్వర్, రాజేందర్‌గౌడ్, రాములు, శ్రీను, గంగారెడ్డి, అంజిరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్‌అలీ పాల్గొన్నారు.

‘దేశ సమైక్యతను దెబ్బతీసే కుట్ర’

సంగారెడ్డి ఎడ్యుకేషన్: మత విద్వేషాలే లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ సర్కార్ దేశ సమైక్యత, సమగ్రతలకు విఘాతం కలిగిస్తుందని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు ఆరోపించారు. ఆదివారం సంగారెడ్డి కేవల్ కిషన్ భవన్‌లో జరుగుతున్న జిల్లాస్థాయి శిక్షణ తరగతులకు హాజరై మాట్లాడారు. దళిత జనాభా ప్రకారం సబ్‌ప్లాన్ నిధులను కేంద్ర బడ్జెట్‌లో కేటాయించకుండా మోసం చేస్తుందన్నారు. ప్రైవేట్ రంగ సంస్థలలో రిజర్వేషన్లు అమలు చేయకపోవడంతో రాజ్యాంగ హక్కులను దళితులు, బలహీనవర్గాలు పొందలేకపోతున్నారని అన్నారు.

విద్యాహక్కు చట్టం అమలు చేయాలి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రైవేట్ పాఠశాలలో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడంతో పాటు నిరుపేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సంగారెడ్డిలో ఆయన మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టం ప్రకారం 6 నుంచి 14 ఏళ్లు ఉన్న పేద విద్యార్థులకు ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం ఉచిత సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు విద్యను వ్యాపారం చేస్తున్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజయ్య, శ్రీనివాస్, మహేష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

హత్నూర(సంగారెడ్డి): అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నస్తీపూర్ సాదులనగర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉన్నామన్నారు. బడుగు, బలహీనవర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని హితవు పలికారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని విమర్శించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి హకీం, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కృష్ణ, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు రాజేందర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, వెంకటేశం, సత్యం, సతీష్, కృష్ణతో పాటు మండలంలోని ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బడి.. ఆరా తప్పనిసరి!

ఆకట్టుకునే ప్రచారాలు నమ్మి మోసపోవద్దు

- పాఠశాల గురించి తెలుసుకున్నాకే చిన్నారులను చేర్పించాలి
- రిజిస్ట్రేషన్ గుర్తింపుపై ఆరా తీయాలి
- అర్హులైన టీచర్లు ఉన్నారో లేదో పరిశీలించాలి
- నిపుణుల సూచనలు



సదాశివపేట(సంగారెడ్డి): విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ప్రైవేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ల వేట ప్రారంభించాయి. తల్లిదండ్రులను ఆకర్షించేందుకు ఇంటింటా ప్రచారాలు నిర్వహించారు. ప్రస్తుతం బడులు ప్రారంభించినా ఆపడం లేదు. అయితే పాఠశాల గురించి పూర్తిగా తెలుసుకున్నాకే చిన్నారులను చేర్పించాలని నిపుణులు సూచిస్తున్నారు,


పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న పాఠశాలలు

జిల్లాలో ఇప్పటికే 454 పైగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలుండగా ఈ విద్యాసంవత్సరంలో మరో 15 వరకు కొత్తగా ఏర్పాటైనట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి నియోజవర్గంతోపాటు జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్, పటాన్‌చెరు, జిల్లాలోని 12 మున్సిపాలిటీల, 26 మండలాల పరిధిలోనూ ఏటా కొత్త పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వీటిలో చాలా వాటికి అనుమతులు లేవని సమాచారం. విద్యాశాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో ఆయా విద్యాసంస్థలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఫీజుల రూపంలో పిల్లల తల్లిదండ్రులను దోచుకుంటున్నాయి. మరికొన్ని విద్యాసంస్థలు ముందుగా అడ్మిషన్ తీసుకుంటే ఫీజులో రాయితీ ఉంటుందని మభ్యపెట్టి ముందుగా అడ్మిషన్లు చేశారు. వాస్తవానికి విద్యాశాఖ అనుమతి తీసుకున్న తర్వాతే విద్యార్థులను చేర్చుకోవాలి. తర్వాత పూర్తిస్థాయి అనుమతి తీసుకోవాలి. ప్రాథమిక స్థాయికి జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి, ఉన్నత తరగతులు ప్రారంభించాలంటే పాఠశాల విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) ద్వారా పాఠశాల విద్యాకమిషన్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. సీబీఎస్ఈ సిలబస్ బోధించేందుకు కేంద్ర విద్యామండలి అనుమతులు కావాలని నిబంధనలు స్పష్టంగా చెబుతున్నా ప్రైవేటు విద్యాసంస్థలు ఇలాంటి అనుమతులేవీ తీసుకోకుండానే తమ సంస్థల్లో విద్యార్థులను చేర్పించుకుని అనుమతులు లభించకపోతే పిల్లల్ని నట్టేట ముంచుతున్నాయి.

గుర్తింపు తప్పనిసరి

గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలి. ఎటువంటి అనుమతులు తీసుకోకుండా కొన్ని పాఠశాలలు ఇతర విద్యాసంస్థల తరఫున పరీక్షలు రాయిస్తుంటారు. అలా పరీక్ష రాసిన విద్యార్థులను ప్రభుత్వం ప్రైవేట్ విద్యార్థులుగా పరిగణిస్తుంది. ఇలాంటి విషయాల్లో తల్లిదండ్రుల జాగురత అవసరం.

అనుమతులు లేకుంటే ఫిర్యాదు చేయండి



ప్రైవేట్ యాజమాన్యం ప్రారంభించే ప్రతీ పాఠశాలకూ ప్రభుత్వ గుర్తింపు తప్పనిసరి. ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలలుంటే జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి ఫిర్యాదు చేయవచ్చు. అటువంటి విద్యా సంస్థలపై చర్యలు తీసుకుంటాం. కొత్తగా పాఠశాలలు ప్రారంభిస్తే పూర్తి అనుమతి తీసుకున్న తర్వాత మాత్రమే అడ్మిషన్లు చేపట్టాలి.

–వెంకటేశ్వర్లు, డీఈఓ, సంగారెడ్డి

క్లుప్తంగా

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: స్కూటీని టిప్పర్ ఢీకొట్టిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ మల్లికార్జున నగర్‌కి చెందిన తరుణ్ (28) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం స్కూటీపై బీరంగూడ నుంచి కొల్లూరు వెళ్తుండగా గుట్ట మల్లికార్జున స్వామి దేవస్థానం రోడ్డులో వెనుక నుంచి వచ్చిన టిప్పర్ స్కూటీని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన తరుణ్‌ను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్

- ఒకరికి తీవ్రగాయాలు

మనోహరాబాద్(తూప్రాన్): బైక్‌ను టిప్పర్ ఢీకొట్టడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... మెదక్ మండలం రాజ్‌పల్లి గ్రామానికి చెందిన విఠల్ తన బైక్‌పై మేడ్చల్ వైపు పని నిమిత్తం వెళుతున్నాడు. ఈ క్రమంలో మనోహరాబాద్ మండలం జీడిపల్లి శివారులోకి రాగానే జాతీయ రహదారి–44పై గుర్తు తెలియని టిప్పర్ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో విఠల్‌కు తల పగిలి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని హైవే అంబులెన్సులో మేడ్చల్ ఆస్పత్రికి తరలించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మద్దూరు(హుస్నాబాద్): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మహ్మద్ జిలాని కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో గ్రామంలో అతని ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు ఎగిసిపడి ఇంటికి నిప్పంటుకుంది. ఈ ఘటనలో ఇంట్లోని సామగ్రి మొత్తం కాలిబూడిదైంది. ఎస్‌ఐ షేక్ మహబూబ్ ఘటనా స్థలానికి చేరుకొని ఫైరింజన్ సహాయంతో మంటలను ఆర్పించారు. కాగా మంటలు ఎగిసి పడటంతో సమీపంలోని ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి


మృతి చెందిన ఆవు

కొమురవెల్లి(సిద్దిపేట): విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రసులాబాద్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎర్రోళ్ల యాదయ్య ప్రతి రోజు మాదిరిగా ఆవును మేపుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రూ.లక్ష నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

రేషన్ బియ్యం పట్టివేత

మద్దూరు(హుస్నాబాద్): ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన మండలంలోని రేబర్తిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బొమ్మ రాజయ్య అనే వ్యక్తి ఇంట్లో యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి గ్రామానికి చెందిన గుగులోత్ లక్ష్మి అనే మహిళ అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేసినట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పోలీసులు ఇంట్లో తనిఖీ చేయగా సుమారు 5క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. ఆర్‌ఐ రమేష్ సహకారంతో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని గ్రామంలోని రేషన్ షాపునకు తరలించారు. లక్ష్మిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అర్చకులకు తీపి కబురు

ఉమ్మడి జిల్లాలో 820 ఆలయాలు

- అర్చక, ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్
- విధివిధానాలు ప్రకటించిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న అర్చకులు

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వం అర్చక, ఉద్యోగులకు తీపికబురు అందించింది. ఎన్నో ఏళ్లుగా ఆలయాల్లో పనిచేస్తున్న అర్చక ఉద్యోగులు, ధూపదీప నైవేద్య అర్చకులకు బీమాతోపాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేసేందుకు విధివిధానాలు ప్రకటించడంతో అర్చకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో మరణానంతరం అందించే గ్రాట్యూటీ, ఉపనయనం గ్రాంటు, ఇంటి నిర్మాణం, మరమ్మతులు, ఉద్యోగుల పిల్లలకు విద్య ఇతర ఖర్చులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, వివాహానికి నిధులను అందించేందుకు ఆమోదం తెలిపింది. అర్చకులు, ఉద్యోగులు, ధూపదీప నైవేద్య అర్చకులు రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవశర్మ ఆధ్వర్యంలో తమ సమస్యలపై పోరాటం చేస్తున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం విధివిధానాలు ప్రకటించింది.

క్రమక్రమంగా పెంచుతూ..

ఆలయాల్లో నిత్యపూజలు, ధూపదీప నైవేద్యాలు కొనసాగించి అర్చకులకు ఆర్థిక చేయూత అందించేందుకు 2009లో డీడీఎన్ పథకానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టారు. అప్పట్లో నెలకు రూ.2,500 ఇచ్చేవారు. 2015లో దాన్ని రూ.6 వేలకు పెంచారు. ఇందులో ఆలయ పూజాద్రవ్యాలకు రూ.2 వేలు, అర్చకుడికి రూ.4 వేలు వేతనంగా నిర్ణయించారు. 2023లో పూజా ద్రవ్యాలకు రూ.4 వేలు, అర్చకులకు రూ.6 వేల చొప్పున పెంచుతూ ప్రభుత్వం నిర్ణయించింది. ధూప దీప నైవేద్య అర్చకులకు ప్రభుత్వం పథకం కింద పలు గ్రాంట్స్, బెనిఫిట్స్, తదితర వాటిని అందించనుంది.


సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు (ఫైల్)

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా


బద్దారంలోని హనుమాన్ ఆలయం

ఇప్పటి వరకు మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లో తొలి విడతలో 140, రెండో విడతలో 276, మూడో విడతలో 404 ఆల యాలను ఎంపిక చేసి పథకాన్ని వర్తింపజేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,200 ఆలయాలు ఉండగా, ఏ, బీ, సీ, డీ విభాగాలుగా విభజించారు. ఏ విభాగంలో ఉన్న 36 ఆలయాలకు ప్రభుత్వమే వేతనాలు చెల్లిస్తోంది. బీ, సీ విభాగాల వారికి హుండీ, భక్తులు, దుకాణ సముదాయాల నుంచి వచ్చే ఆదాయంలో 30 శాతం చెల్లిస్తున్నారు. ఇక డీ విభాగంలో మఠాలు, మఠాధిపతుల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. తాజాగా ప్రభుత్వం దేవాదాయ, ధర్మాదాయశాఖ ధూపదీప నైవేద్యం పథకం(డీడీఎన్ఎస్) ద్వారా ఈ పథకాన్ని మరిన్ని ఆలయాలకు వర్తింపజేసేందుకు దరఖాస్తులు ఆహ్వానించింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని వివిధ పురాతన, ఆదరణకు నోచని ఆలయాలకు కొత్త శోభ రానుంది.

సమస్యలు పరిష్కారం



ఎన్నో ఏళ్లుగా చేస్తున్న పోరాటానికి ప్రభుత్వం పరిష్కారం చూపడం హర్షణీయం. ప్రభుత్వం దేవాదాయ, ధర్మాదాయ శాఖ ద్వారా అర్చకులు, ఉద్యోగుల సంక్షేమనిధి ట్రస్టు ద్వారా అందిస్తున్న పథకాలను ధూప దీప నైవేద్య అర్చకులకు కూడా అందించడం సంతోషం. విద్య, ఇంటి నిర్మాణం, ఉపనయనం, వివాహానికి, అంతిమ సంస్కారాలకు నిధులు చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం వల్ల పేద అర్చకులకు మేలు జరగనుంది.

– శలాక రాజేశ్వర శర్మ, ధూపదీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు, మెదక్

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



ప్రభుత్వం ధూప దీప నైవేద్య అర్చకుల సంక్షేమానికి చర్యలు తీసుకోవడం హర్షణీయం. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తూ రిటైర్మెంట్ బెనిఫిట్స్, తదితర వాటికి నిధులు ఇస్తామనడం సంతోషంగా ఉంది. అర్చక, ఉద్యోగుల మాదిరిగా డీడీఎన్ అర్చకులకు ప్రతీ నెలా వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలి. ధూపదీప నైవేద్య ఆలయాల సంఖ్య మరింత పెరిగేలా అవకాశం కల్పించాలి.

– పి.శ్యాంసుందర్ శర్మ, డీడీఎన్ఎస్ ప్రధాన కార్యదర్శి, మెదక్

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ


రాజీవ్ రహదారిపై కొమురవెల్లి కమాన్ వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనక నుంచి ఢీకొట్టిన గూడ్స్ లారీ

- తప్పిన పెను ప్రమాదం
- క్లీనర్‌కు స్వల్ప గాయాలు

కొండపాక(గజ్వేల్): బస్టాప్ వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వచ్చిన గూడ్స్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ క్లీనర్‌కు మాత్రమే స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో రాజీవ్ రహదారిపై కొమురవెల్లి కమాన్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి మంచిర్యాలకు ప్రయాణికులతో వెళ్తోంది. ఈ క్రమంలో కొమురవెల్లి కమాన్ వద్ద ప్రయాణికులు దిగేందుకు బస్సు ఆపాడు. వెనుక వచ్చిన గూడ్స్ లారీ ఢీకొట్టింది. లారీ క్లీనర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. విషయం తెలుసుకున్న కుకునూరుపల్లి పోలీసులు, టోల్ ప్లాజా సహాయక సిబ్బంది హుటా హుటిన ఘటనా స్థలానికి చేరుకొని క్లీనర్‌ను బయటకు తీశారు. స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పరారయ్యాడు. లారీ రోడ్డుకు అడ్డంగా ఉండటంతో అరగంటపాటు ట్రాఫిక్ జాం అయింది. క్రేన్ సహాయంతో లారీని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. బస్సు డ్రైవరు ఆది మహేందర్‌రావు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళ అదృశ్యం

రామాయంపేట(మెదక్): మనస్తాపంతో ఇంటి నుంచి వెళ్లిన మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బూరె ఎల్లవ్వ (50)కు, తన ఇంటి పక్కనే నివాసం ఉంటున్న వారికి మధ్య గొడవ జరిగింది. మనస్తాపంతో ఆమె శనివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు ప్రక్కల, బంధువుల వద్ద వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె కూతురు మంగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేతకీలో ఎస్పీ పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయంలో ఇంటిలిజెన్స్ విభాగం ఎస్పీ శిరీష కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భగుడిలోని పార్వతీపరమేశ్వరులకు అభిషేకం, కూంకుమార్చన, మహా మంగళహారతి పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు ఆమెను సన్మానించారు. ఆలయ ఈఓ శివరుద్రప్ప, పాల్గొన్నారు.

ఇంటిని తన పేరుపై రాయలేదని భార్య హత్య!

- కర్రలతో కొట్టిన భర్త, కుమారుడు, మరిది
- ఆపై యాక్సిడెంట్ జరిగిందని ఆస్పత్రిలో చేర్పించిన వైనం
- చికిత్స పొందుతూ మృతి

పటాన్‌చెరు టౌన్: ఇంటిని తన పేరుపై రాయాలంటూ భర్త భార్యపై హత్యాయత్నం చేశాడు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... ఒడిశాకు చెందిన ఉమేష్ కుమార్ సింగ్, భార్య అబాదేవి(38) , కుటుంబ సభ్యులతో కలిసి బతుకుదెరువు కోసం వచ్చి అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పటేల్‌గూడాలో నివాసం ఉంటున్నారు. స్థానికంగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే 2024లో ఉమేష్ తల్లి కళావతి దేవి అనారోగ్యంగా ఉన్న సమయంలో ఆమెకు అబాదేవి సేవలు చేసింది. దీంతో ఆమె పేరుపై పాట్నాలో ఉన్న రెండు గదుల ఇంటిని అబాదేవి పేరుపై రిజిస్ట్రేషన్ చేసింది. దీంతో అప్పటి నుంచి ఉమేష్ తన భార్యను రెండు గదుల ఇంటిని తన పేరుపైకి మార్చాలని గొడవపడేవాడు. అయితే అబాదేవి వారం క్రితం సంగారెడ్డి మహిళా పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించగా భార్యాభర్తలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం అబాదేవి 14వ తేదీన తన స్వగ్రామం బీహార్‌కు వెళ్తానని చెప్పింది. వెంటనే పథకం రచించిన భర్త ఉమేష్ కుమార్, కొడుకు అంకిత్, మరిది రమేష్ కుమార్ సింగ్ కర్రలతో విచక్షణ రహితంగా ఆమెను కొట్టారు. స్థానికుల సహకారంతో తీవ్రంగా గాయపడిన ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. యాక్సిడెంట్ జరిగిందని అబద్ధం చెప్పి అక్కడ చేర్పి పారిపోయారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఆమె మృతికి కారణమైన భర్త, కుమారుడు, మరిదిపై పోలీసులు హత్య కేసు నమోదు చేశారు.


నర్సాపూర్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనం


చైర్మన్ రాజుయాదవ్ సొంత నిధులతో నిర్మించిన గోదాం భవనం

లాభాల బాటలో ‘నర్సాపూర్’

- పీఏసీఎస్ ఆధ్వర్యంలో వ్యాపారాలు
- ఐదేళ్లలో పది రెట్లు పెరిగిన ఆదాయం
- చైర్మన్ సొంత నిధులతో గోదాం నిర్మాణం
- మరిన్ని సేవలకు ప్రణాళిక

నర్సాపూర్ : నర్సాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో పలు రకాల వ్యాపారాలు చేపట్టడంతో అభివృద్ధి బాటలో సాగుతోంది. ఐదేళ్లలో పది రెట్లు ఆదాయం పెరగడంతో బి గ్రేడ్‌లో ఉన్న సంఘం ఏ గ్రేడ్‌లోకి మారింది. ప్రస్తుత పాలక మండలి 2020 ఫిబ్రవరిలో అధికారంలోకి రాగా చైర్మన్‌గా ఎం.రాజుయాదవ్ బాధ్యతలు చేపట్టారు. రైతులకు సేవ చేయాలన్న లక్ష్యంతో ఆయన పలు కార్యక్రమాలు చేపట్టి.. సొసైటీని లాభాల బాటలోకి తేవడంతో పాటు సొంత నిధులతో గోదాం నిర్మించి సొసైటీకి అప్పగించారు.

పది రెట్లు పెరిగిన ఆదాయం

2020 ఫిబ్రవరి నాటికి పీఏసీఎస్ సంవత్సర ఆదాయం 5 లక్షలు ఉంది. ఒక కోటి 30 లక్షల రుణాలు, డిపాజిట్లుగా టర్నోవర్ ఉండేది. కాగా రాజుయాదవ్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత టర్నోవర్‌ను 2.30 కోట్లకు పెంచారు. రైతులకు ఎక్కువ రుణాలు అందజేశారు. ఆయా పంటల సాగు సమయానికి ముందు రైతులకు అవసరమైన రసాయన ఎరువులు, విత్తనాలు తెచ్చి విక్రయించడంతో రైతుల అవసరాలు తీర్చడంతో పాటు లాభాలు పెరిగాయి. కాగా వరి పంట సీజన్‌లో మండలంలో 17 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వడ్లు కొనుగోలు చేశారు. దీంతో ఆదాయం గతంలో ఉన్న ఐదు లక్షల నుంచి ప్రస్తుతం రూ.50 లక్షలకు పెరిగింది. కాగా సంఘం అద్దె భవనంలో ఉండటంతో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో సంఘం నిధులతో శాశ్వత భవనం నిర్మించారు.

సొంత నిధులతో..

చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రాజుయాదవ్ రైతులకు ఉపయోగపడే పనులు చేస్తున్నారు. రూ.15లక్షల సొంత నిధులతో గోదాం నిర్మించి సంఘానికి అప్పగించారు. 250 మెట్రిక్ టన్నుల కెపాసిటీ గోదాం నిర్మించి సంఘానికి అప్పగించడంతో ఎరువులు, విత్తనాలు విక్రయిస్తున్నారు.

గోదాంల నిర్మాణానికి ప్రణాళిక

మండలంలోని ఆయా గ్రామాల రైతులు విత్తనాలు, ఎరువుల కోసం నర్సాపూర్‌కు వస్తుండటంతో సమయం వృథా కావడంతో పాటు వారిపై ఆర్థిక భారం పడుతుంది. రైతులకు చేరువలో గోదాంలు నిర్మించి విత్తనాలు ఎరువులు అక్కడే అమ్మితే శ్రేయస్కరమనే ఆలోచనలో పాలక మండలి ఉంది. ఇందులో భాగంగా నాలుగు గోదాంలు నిర్మించేందుకు ప్రణాళిక తయారు చేస్తున్నారు.

మెరుగైన సేవలందిస్తాం



పాలక మండలి సభ్యుల సహకారంతో తమ సొసైటీ నుంచి మండల రైతులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నం. రైతులకు రుణాలు పెంచాం. విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచి విక్రయిస్తున్నాం. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు ద్వారా వడ్లు కొని సొసైటీ ఆదాయం పెంచుతున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు చేరువలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలన్న లక్ష్యంతో ఉన్నాం.

– ఎం.రాజుయాదవ్, నర్సాపూర్ పీఏసీఎస్ చైర్మన్

ప్రాణం తీసిన డ్రైవింగ్ సరదా

ట్రాక్టర్ అదుపు తప్పి విద్యార్థి మృతి



నర్సాపూర్ రూరల్: డ్రైవింగ్ సరదాతో విద్యార్థి మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం నారాయణపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. నర్సాపూర్ ఎస్సై లింగం కథనం ప్రకారం... గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల రాజు, లక్ష్మి దంపతుల చిన్న కుమారుడు వినయ్ (15) బ్రాహ్మణపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో పొలం వద్దకు గేదెలను తోలుకొని వెళ్లాడు. అక్కడ వరుసకు అన్న అయిన విష్ణు ట్రాక్టర్‌తో పొలం చదును చేస్తున్నాడు. నేను నడుపుతానని అతని వద్ద నుంచి తీసుకున్నాడు. వినయ్ నడుపుతున్న క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ట్రాలీ అతడిపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యుల రోదనలు అందరిని కంటతడి పెట్టించాయి.

పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలి


విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న రూరల్ సీఐ శ్రీను, డీవైఎస్‌ఓ వెంకటనర్సయ్య

సిద్దిపేటకమాన్: తల్లిదండ్రులు పిల్లలను క్రీడలు, ఆత్మరక్షణ విద్యలో రాణించేలా ప్రోత్సహించాలని పలువురు పేర్కొన్నారు. ఆదివారం తైక్వాండో విద్యార్థుల బెల్ట్ ప్రమోషన్ టెస్ట్‌ను సిద్దిపేటలోని ఐఎంఏ హాల్‌లో నిర్వహించారు. బెల్ట్ టెస్ట్ ఆర్గనైజర్, తైక్వాండో జిల్లా కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టెస్ట్‌లో 60 మంది విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రమోట్ అయిన విద్యార్థులకు ముఖ్య అతిథులు డీవైఎస్‌ఓ వెంకటనర్సయ్య, సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, జిల్లా తైక్వాండో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రాధాకృష్ణశర్మ, డాక్టర్ ప్రణీత్ బెల్టులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తైక్వాండో నేర్చుకోవడం వల్ల పిల్లల్లో శారీరక ధృడత్వంతో పాటు ఆత్మస్థైర్యం, క్రమశిక్షణ, ఆరోగ్యవంతమైన జీవితం అలవడుతుందన్నారు.

‘విత్తనోత్పత్తి’ సాగుకే సై!

- మొక్కజొన్న, వరి సాగు చేస్తున్న రైతులు
- డివిజన్‌లో వెయ్యి ఎకరాల్లో..
- ఎర్ర నేలలు కావడంతో అనుకూలం
- ఆశించిన దిగుబడులు, గిట్టుబాటు ధరలు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని మెట్ట నేలలో రైతులు విత్తనోత్పత్తి పంటలను సాగు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. విత్తన కంపెనీలు రైతులకు సీజనుకు ముందే అవగాహన, పంట దిగుబడులపై నమ్మకం కల్పించడం, పంటను కొనుగోలు చేయడానికి అంగీకారం తెలుపడంతో రైతులు విత్తనోత్పత్తి పంటలను సాగు చేస్తున్నారు. హుస్నాబాద్ డివిజన్ అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడ మండలాల్లో దాదాపుగా 800 ఎకరాల్లో మొక్కజొన్న , 300 ఎకరాల వరకు వరి పంటలను సాగు చేస్తున్నట్లు ఆయా కంపెనీల ఆర్గనైజర్లు వెల్లడించారు. జిల్లాలో హుస్నాబాద్ ఎర్ర నేలలు విత్తనోత్పత్తికి అనువుగా ఉండటంతోనే ఇక్కడ ఎక్కువ సాగు విస్తీర్ణం పెంచుతున్నారు.

పక్కదారి పడుతున్న ప్రభుత్వ విత్తనం

ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ అనుసంధానంతో గ్రామాల్లో విత్తనోత్పత్తి సాగు చేయించి ఆ విత్తనాలనే ఐదేళ్ల వరకు ఉపయోగించేలా ప్రణాళిక రూపొందించింది. గ్రామానికి ముగ్గురు ఆదర్శ రైతులను ఎంపిక చేసి విత్తనాలు అందించాలి. కానీ వ్యవసాయ అధికారులు ఎవరికో ఒకరికి ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వరి 10 కిలోల బ్యాగులు, పెసర 3 కిలోల బ్యాగుల్లో విత్తనాలను యూనివర్సిటీ సరఫరా చేసింది. వరి విత్తనోత్పత్తికి 110 మంది, పెసర సాగు చేసేందుకు 55 మంది రైతులను ఎంపిక చేసి విత్తనాలను అందించాల్సి ఉంది. హుస్నాబాద్ డివిజన్‌కు వరి (డబ్ల్యూజీఎల్ 44) 1110 కిలోల విత్తనాలు, పెసర (డబ్ల్యూజీఎల్ 385) రకం 165 కిలోలు విత్తనాలను యూనివర్సిటీ పంపించింది. కానీ కోహెడ మండలానికి 3.20 క్వింటాళ్ల వరి, 48 కిలోల పెసర, హుస్నాబాద్ మండలానికి 2.20 క్వింటాళ్ల వరి, 33 కిలోల పెసర, అక్కన్నపేట మండలానికి 2.80 క్వింటాళ్ల వరి, 42 కిలోల పెసర విత్తనాలను పంపిణీ చేశారు. కానీ వ్యవసాయ అధికారులు ఆర్ఎంపీలు, డాక్టర్లు, వ్యాపారులకు విత్తనాలు కట్టబెట్టినట్లు రైతులు విమర్శిస్తున్నారు.



గాంధీనగర్‌లో సాగు చేసిన మొక్కజొన్న

రైతులకు ఆశించిన దిగుబడులు

విత్తనోత్పత్తి హైబ్రీడ్ రకానికి చెందిన పంటలను సాగు చేయడం వల్ల రైతులకు ఆశించిన దిగుబడులు వస్తున్నాయి. పంటల సాగు సమయంలో తెగుళ్లు, రసాయన ఎరువుల వాడకంపై విత్తనోత్పత్తి కంపెనీల ఆర్గనైజర్లు క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించి పంటలకు వేయాల్సిన ఎరువులను ప్రతిపాదిస్తారు. కావల్సిన ఎరువులు, పురుగుల మందులను కూడా వారే ఇవ్వడం వల్ల పెట్టుబడి భారం తగ్గుతుంది. మొక్కజొన్న డబుల్ క్రాస్ విత్తన రకం బెండుతోనే కంపెనీలు రైతుల వద్ద క్వింటాళ్లకు రూ.2,200 నుంచి రూ.3వేలు వరకు ధర చెల్లించి కొనుగోలు చేస్తారు. వరి సాగు యాసంగిలో ఎకరాకు ఒక్కొక్క రైతు 35 క్వింటాళ్ల దిగుబడులు తీశారు.


ప్రభుత్వ విత్తనోత్పత్తి బ్యాగులను అందుకుంటున్న ఆర్ఎంపీ వైద్యులు, వ్యాపారులు (ఫైల్)

సాగు చేసే రైతులకు ఇవ్వాలి



ప్రభుత్వం గ్రామీణ రైతులకు నాణ్యమైన విత్తనోత్పత్తి విత్తనాలు ఇవ్వాలని ఆలోచిస్తే వ్యవసాయ అధికారులు ఎవరికో ఒకరికి విత్తనం ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఒకసారి సాగు చేసిన విత్తనం అదే రైతుల వద్ద ఐదేళ్ల వరకు విత్తనాల కోసం ఉపయోగించుకోవాలి. అధికారులకు ముందు చూపు లేకుండా విత్తనాలు ఇచ్చేశారు. పంటలు పండించే రైతులను గుర్తించి విత్తనాలు ఇయ్యాలి.

– అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, రైతు, హుస్నాబాద్

దిగుబడి వచ్చేవే సాగు చేస్తరు



హుస్నాబాద్ నేలలు విత్తనోత్పత్తికి అనువుగా ఉండటంతో విత్తన కంపెనీలు రైతులను చేరదీసి విత్తనం సరఫరా చేసి పంటలు సాగు చేయిస్తున్నారు. రైతులకు లాభాలు వచ్చే పంటలను సాగు చేస్తరు తప్ప మనం వేయమన్న పంటలు వేయరు. విత్తన కంపెనీలు ఇచ్చిన మాటకు కట్టుబడి రైతులకు డబ్బులు చెల్లించడంతో ఆ పంటలను సాగు చేస్తున్నారు. ప్రభుత్వ విత్తనోత్పత్తి విత్తనాలు వరి 11.10 క్వింటాళ్లు, పెసర 165 కిలోలు వచ్చాయి. మండలాలకు కేటాయించిన విత్తనాలను ఏఈఓలు రైతులకు అందించారు.

– రమేశ్, ఏడీఏ, హుస్నాబాద్